క్లుప్తంగా

మద్యం తాగి వాహనం నడపొద్దు



ధరూరు: మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ శ్రీహరి హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుపై వాహనాలు తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వాహనదారులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో పండ్లు పంపిణీ



అయిజ: మహ్మద్ ప్రవక్త జయంతి మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకొని శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎండీ తుమ్మిళ్ల నజీర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాష, ముస్తఫా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ ప్రమాణ స్వీకారం



గద్వాల: మానవ సేవే మాధవసేవ అనే పదానికి నిదర్శనం గద్వాల ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ సభ్యులని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఫంక్షన్ హాల్ నిర్మాణానికి రూ.50 లక్షల నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం అధ్యక్ష, కార్యవర్గ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కుర్వ హనుమంతు, బోయ వెంకట్రాములు, జంబురామన్‌గౌడ్, రాజశేఖర్, మురళీ, నాగిరెడ్డి, రాము, సురేష్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అమరచింత: మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో శుక్రవారం ఆర్బీ డిపాజిటర్స్ సెమినార్ కార్యక్రమం ద్వారా ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నారాయణ కళాజాతా బృందం ఆటపాటలతో బ్యాంకుల్లో ఆర్థిక లావాదేవీల వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. నేటి సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని వివరించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ శేఖర్‌రెడ్డి, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీలో అవినీతిపై విచారణ చేపట్టాలి



మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఉమ్మడి జిల్లా డీసీసీబీలో అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనర్సింహ డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీసీసీబీలో కొందరు పనిగట్టుకొని అవినీతికి పాల్పడుతున్నారని, కొందరు ఉన్నతాధికారులు సొంత నిర్ణయాలతో ఉద్యోగులను వేధిస్తుండడం, పేస్కేల్ లేని ఉద్యోగులను బదిలీ చేస్తామంటూ బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. అక్రమాలపై విచారణ జరపకుంటే పోరాటాలు చేస్తామన్నారు. 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జరుగనున్న సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో సాయుధ పోరాట అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు నరేందర్‌రెడ్డి, బాలకిషన్, సురేశ్, రాము, గోవర్ధన్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

బిల్లులకు మోక్షమెప్పుడో?



తనగలలో పూడిక తీత చేపడుతున్న కూలీలు(ఫైల్)

- రెండేళ్లు పూర్తయినా అందని మెటీరియల్ బిల్లులు
- 2022- 23లో ఉపాధిహామీ కింద చేపట్టిన పనులు
- వడ్డీలు కట్టలేక పోతున్నామని రైతుల ఆవేదన

శాంతినగర్: ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన బిల్లులు పడక అవస్థలు పడుతున్నట్లు మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్లుగా చేసిన పనులకు బిల్లులు పడక పోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక నష్టపోతున్నామని వాపోతున్నారు.

రూ.29 లక్షల బిల్లుల బకాయి

వడ్డేపల్లి మండల పరిధిలోని పది గ్రామ పంచాయతీల్లో 2022-23 ఏడాదిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పశువులు, గొర్రెల పాకలు, పండ్ల తోటల పెంపకం, బావుల పూడికతీత పనులను చేపట్టినట్లు రైతులు తెలిపారు. రెండేళ్లు పూర్తయినా ఇప్పటివరకు వారు



జక్కిరెడ్డిపల్లిలో మెటీరియల్ బిల్లు రాని పశువుల పాక (ఫైల్)

మెటీరియల్ పేమెంట్ రాకపోవడంతో తెచ్చిన అప్పులకు సంబంధించి వడ్డీలు కట్టలేక సతమతమవుతున్నట్లు వాపోతున్నారు.

రూ.60 వేల వరకు

ఒక్కో రైతుకు సంబంధించి రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు బిల్లులు రావాల్సి ఉందని, అప్పు తెచ్చిన వారికి సమాధానం చెప్పలేకపోతున్నామని రైతులు చెబుతున్నారు. మండల పరిధిలో రెండేళ్ల క్రితం చేపట్టిన పనులకు సంబందించి రూ.29 లక్షలు రైతులకు చెల్లించాల్సి వుందని ఈజీఎస్ అధికారులు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఉన్నతాధికారులు స్పందించి బిల్లులు వెంటనే రైతుల ఖాతాల్లో జమచేసి ఆర్థిక ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

బిల్లుల కోసం ఎదురుచూపు



మా పొలంలోని బావిని పూడికతీస్తే బిల్లులు ఇస్తామని అధికారులు తెలిపారు. దీంతో ఐదు గురుం బావుల్లో పూడిక తీత పనులు చేపట్టాం. కూలీలకు మాత్రం డబ్బులు ఇచ్చారు. మాకు మాత్రం ఒక్క పైసా కూడా ఇవ్వలేదు.

– పద్మావతమ్మ, రైతు, తనగల

అధికారుల చుట్టూ ప్రదక్షిణలు



రెండేళ్ల క్రితం పూడిక పనులు చేయించాం. బిల్లులు రాలేదని పలు మార్లు ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ తిరిగాం. వస్తాయని చెబుతున్నారేగాని బిల్లులు మాత్రం పడటం లేదు. బకాయి బిల్లులు తొందరగా చెల్లించాలి.

– పుల్లారెడ్డి, రైతు, తనగల,

టెక్నికల్ సమస్యతో ఆలస్యం

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో 2022- 23లో చేపట్టిన పనులకు సంబంధించి గతంలో యాప్ ఉండేది. స్టేట్ నుంచి సెంట్రల్‌కు మార్చడంతో టెక్నికల్ సమస్య తలెత్తింది. ఉన్నతాధికారుల దృష్టికి సమస్య వివరించాం. 15 రోజుల్లో బిల్లులు వచ్చే అవకాశం ఉందని ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

– మహేశ్వర్‌రెడ్డి, ఇంజినీరింగ్ కన్సల్టెంట్, వడ్డేపల్లి

నెరవేరుతున్న పేదల సొంతింటి కల

గద్వాల: ఇళ్లులేని నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్లు కట్టించి వారి సొంతింటి కల నిజం చేస్తుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పరమాల శివారులో నిర్మించిన నూతన డబుల్‌బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులతో కలిసి పరిశీలించారు. 6వ తేదీ శనివారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ముచ్చటించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, జంబురామన్‌గౌడ్, తిమ్మారెడ్డి, రాజశేఖర్, బాబర్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డబుల్‌బెడ్రూం ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

'జీఎస్టీ' తగ్గింపు విప్లవాత్మక నిర్ణయం



సాతర్లలో ప్రధాని మోదీ కటౌట్‌కు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



కేటీదొడ్డిలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కేటీదొడ్డి/ఇటిక్యాల/మానవపాడు/అయిజ/రాజోళి: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్లాబ్‌ల తగ్గింపు నిర్ణయం విప్లవాత్మకమైందని కేటీదొడ్డి బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్రీపాదరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పేదలకు వరంగా, అభివృద్ధి కారకంగా ఉంటుందన్నారు. ప్రతి భారతీయ పౌరుడి జీవన ప్రమాణాలు మెరుగుపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు హన్మిరెడ్డి, ఎర్ర భీంరెడ్డి, జయన్న, ముని, వాచనాయక్ తదితరులు పాల్గొన్నారు.

■ బీజేపీ మండలాధ్యక్షుడు షేక్ అబ్దులా ఆధ్వర్యంలో ఇటిక్యాల మండలంలోని సాతర్లలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, చిన్న, మునీ, బాబు, రామకృష్ణ, రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

■ మానవపాడు మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రధాని చిత్రపటానికి పూలమాల వేసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా అధ్యక్షుడు తిమ్మప్ప, రాఘవయ్య, రామాంజనేయులు, మదన్‌మోహన్, మధు, వెంకటేష్, శ్రీనివాసులు, బాబు తదితరులు పాల్గొన్నారు.

■ అయిజ పట్టణంలోని నర్సప్ప ఆలయం సమీపంలో బీజేపీ నాయకులు మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి, భీమసేనరావు తదితరులు పాల్గొన్నారు.

■ సామాన్యులను దృష్టిలో పెట్టుకునే కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని బీజేపీ రాజోళి మండల అధ్యక్షుడు శశికుమార్ అన్నారు. మండల కేంద్రంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఈసీ అంజనేయులు, నర్సింహులు, గోవిందు రాజులు, రాజేష్, రామయ్య, రామకృష్ణ తదిదరులు పాల్గొన్నారు.

స్థానిక వ్యాపారులను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న వర్తక సంఘం నాయకులు

గద్వాలటౌన్: కొనుగోలు దారులు స్థానిక వ్యాపారులను ప్రోత్సహించాలని గద్వాల వర్తక వ్యాపారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కరాటే శ్రీహరి కోరారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపారాల కోసం ఇప్పటి వరకు పలు రాష్ట్రాల నుంచి చాలా మంది వచ్చారని, ఇకపై కొత్త వారిని రాకుండా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం స్థానిక వ్యాపారులకు ప్రాధాన్యత కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోళ్లపై కమీషన్ల వ్యవస్థను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వర్తక వ్యాపారుల సంఘం నాయకులు శ్రీనివాసులు ఆచారి, చల్లా శ్రీధర్, విష్ణుఆచారి, మధు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కంచె ఏర్పాటు చేయండి సారూ..

ఇటిక్యాల: మండల పరిధిలోని బుడ్డారెడ్డిపల్లి గ్రామంలో రక్షణ కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. మూగజీవాలు ప్రాణాలు కోల్పోతున్నా అధికారులు మాత్రం రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు నిత్యం ఈ దారి గుండా వెళ్తుంటారని ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



బుడ్డారెడ్డిపల్లిలో ఇళ్ల మధ్య ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

హోటల్ నిర్వాహకుడిపై దాడి

గద్వాల క్రైం: హోటల్ నిర్వాహకుడిపై దాడి చేసిన సంఘటనలో పలువురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఫుడ్ వరల్డ్ హోటల్‌లో గురువారం రాత్రి కొంత మంది యువకులు భోజనం చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో మద్యం మత్తులో హోటల్ నిర్వాహకుడితో వాగ్విదానికి దిగారు. ఈ క్రమంలో హోటల్ నిర్వాహకుడిపై దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితుడు రంజిత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అయిజ: మండలంలోని వెంకటాపురం స్టేజీ సమీపంలో ఆటో బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు స్వల్పంగా గాయపడిన ఘటన శుక్రవారం జరిగింది. మండలంలోని కిష్టాపురానికి చెందిన జానకి రాముడు, లక్ష్మీబాబు బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని ఆటో ఢీకొట్టడంతో రోడ్డుపై పడ్డారు. ప్రమాదంలో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు.



గురువులను గౌరవించడం బాధ్యత



అలంపూర్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

అయిజ/కేటీదొడ్డి/మానవపాడు/ఎర్రవల్లి/అలంపూర్: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ జ్యోతి ఉపాధ్యాయులను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు రామచంద్రారెడ్డి బీజేపీ నాయకులతో కలిసి విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరించారు. గురువులను గౌరవించడం మనందరి బాధ్యతన్నారు. అదే విధంగా మండలంలోని సింధనూరులో 2024- 25 బ్యాచ్ విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బహూకరించారు. అనంతరం ఉపాధ్యాయులు విగ్రహాన్ని ఆవిష్కరించారు.



అయిజలో ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న తహసీల్దార్ జ్యోతి

■ అలంపూర్ పట్టణంలోని మాంటిస్సోరీ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు వేడుకల్లో భాగంగా ఉపాధ్యాయులు వివిధ నాటికలు ప్రదర్శించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కేఎన్‌వీ రవి ప్రకాష్, ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నందిన్నెలో..

■ కేటీదొడ్డి మండలంలోని నందిన్నె రాఘవేంద్ర పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి ఆయన చేసిన సేవలు కొనియాడారు.



ఎర్రవల్లి కూడలిలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

■ మానవపాడు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

■ ఎర్రవల్లి మండల కేంద్రంలో జైనడిగడ్డ యువత ఆధ్వర్యంలో సర్వేపల్లి రాదాకృష్ణన్ జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. జిల్లా కన్వీనర్ పల్లె రాజు వివిధ సంఘాల నాయకులతో కలిసి ఆయన కూడలిలో రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సరస్వతి పాఠశాలలో ఎంఈఓ అమీర్‌పాష ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రవి, మల్లేష్‌రెడ్డి, రాంబాబు, నాగరాజు, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మానవపాడులో నివాళులర్పిస్తున్న వార్డెన్ రాము, విద్యార్థులు

ఘనంగా గణేశ్ నవరాత్రుల ముగింపు

రాజోళి/అలంపూర్ రూరల్/అయిజ: అలంపూర్ మండల పరిధిలో శుక్రవారం భక్తులు భక్తి శ్రద్ధలతో గణనాథులకు పూజలు చేశారు. నవరాత్రుల చివరి రోజు సందర్భంగా పిండి పదార్థాలతో నైవేద్యాలు సమర్పించారు. క్యాతూర్ శ్రీహరిహర దేవాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

■ సుంకేసుల డ్యాంలో వినాయక నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. రాజోళితో పాటు మండలంలోని ఆయా గ్రామాలు, వడ్డేపల్లి మండలంలోని ఆయా గ్రామాల నుంచి తరలివచ్చిన గణనాథులను తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు.

■ అయిజ మండల కేంద్రం, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో చివరి రోజు గణపతి నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మండపాల వద్ద పార్వతీ పుత్రుడికి పిండి వంటలు సమర్పించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



అయిజలో పూజలు చేస్తున్న భక్తులు

నేడు అనంత పద్మనాభస్వామి వ్రతం

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అనంత పద్మనాభ స్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ సత్యచంద్రారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వ్రతం సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం



ఎద్దులగూడెంలో రోడ్డుపై నిలిచిన మురుగు

- సీసీరోడ్లు, డ్రెయినేజీలు లేని వైనం
- రోడ్లపైనే పారుతున్న మురుగు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మల్దకల్: మండంలోని అనుబంధంగా ఉన్న గ్రామాల్లో సీసీరోడ్లు , డ్రైనేజీలు లేక నానా అవస్థలు పడుతున్నట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మధ్య, రోడ్లపై మురుగు నిలిచి ఉండటంతో దుర్గంధం వెదజల్లుతుందంటున్నారు. దీనికి తోడు వర్షపునీరు మురుగుతో కలిసి రోడ్లపై నిలవడంతో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయంటున్నారు. అదే విధంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్న వాటికి సొంత భవనాలు లేవని, రేషన్‌షాపులు లేకపోవడంతో రేషన బియ్యం కోసం సుదూర గ్రామాలకు వెళ్లి రేషన్ బియ్యం తీసుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని వాపోతున్నారు.

5 అనుభంద గ్రామాలు

మల్దకల్ మండలంలోని 25 గ్రామ పంచాయతీలకు 5 అనుబంధ గ్రామాలు ఎద్దులగూడెం, బూడిదపాడు, నేతువానిపల్లితండా, ఈదులపల్లి, చిప్పదొడ్డి ఉన్నాయి. ఆయా గ్రామాల్లో సమస్యలు తాండవిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు సైతం పంచాయతీ గ్రామాలను సందర్శించి వెళుతున్నారే తప్పా అనుబంధ గ్రామాల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ దుకాణాలు లేక ప్రతి నెల రేషన్ కోసం మూడు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి రేషన్ బియ్యం తెచ్చుకుంటున్నట్లు ప్రజలు వాపోతున్నారు. అలాగే అనుబంధ గ్రామాలపై ప్రజాప్రతినిధులు అన్ని విషయాల్లో సవతి ప్రేమను చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



చిప్పదొడ్డిలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

డ్రెయినేజీ నిర్మించాలి



సీసీరోడ్లు ఉన్న డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగు రోడ్లపైనే పారుతూ దుర్గంధం వెదజల్లుతుంది. అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు.

– రామన్న, చిప్పదొడ్డి

సమస్యల పరిష్కారానికి చర్యలు



పంచాయతీ అనుబంధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరైన వెంటనే సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– అంజనేయరెడ్డి, ఎంపీడీఓ, మల్దకల్